
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
ఆదివారం 14 ఏప్రిల్ 2024



యువకుడిపై పోక్సో కేసు నమోదు

బచ్చన్నపేట, ఏప్రిల్ 13: మండలంలోని ఓ గ్రామంలో బాలికను కిడ్నాప్ చేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన నవీన్ అనే యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పెళ్లి చేసుకుంటానని మాయ మాటలతో నమ్మించి, మూడు రోజుల క్రితం బాలికను కిడ్నాప్ చేయగా, కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. బాలికను జనగామలోని సఖీ కేంద్రానికి తరలించామని ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

భూ వివాదంలో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డిపై కేసు

బీఆర్ఎస్ మహిళా నేత కొడుకు భూమిలో నుంచి అక్రమంగా దారి

విచారణ జరిపి కేసు నమోదు చేసిన ఏఎస్పీ



చీటకోడూరులో విచారణ చేస్తున్న ఏఎస్పీ అంకిత్‌కుమార్ శంఖ్వార్

జనగామ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జనగామ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మరో వివాదంలో చిక్కుకున్నారు. నిత్యం భూవివాదాల్లో తలదూర్చుతూ వార్తల్లో నిలిచే ఆయనపై తాజాగా జనగామ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకెళితే.. జనగామ మండలం చీటకోడూరుకు చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు, జనగామ మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ గాడిపల్లి ప్రేమలతారెడ్డి కుమారుడు రాజేందర్‌రెడ్డికి సర్వే నంబర్ 214లో 5.27 ఎకరాలు భూమి ఉంది. ఈ భూమికి అవతల వైపు జనగామ రెవెన్యూ శివారులో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి 3.11 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. కాగా.. ముత్తిరెడ్డి భూమిలోకి వెళ్లేందుకు దారి లేకపోవడంతో తన భూమిలో నుంచి దౌర్జన్యంగా దారి చేశారని రాజేందర్‌రెడ్డి తెలిపారు. గత ఏడాది డిసెంబరు నెలలో తన తండ్రి చనిపోగా దశదినకర్మ పూర్తయ్యే వరకు తాను బయటకు రాలేదని, ఇదే అదునుగా భావించి తన భూమిలో నుంచి దౌర్జన్యంగా దారి తీశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా.. ముత్తిరెడ్డి వేసిన దారిని తొలగించానంటూ తనపై బీఆర్ఎస్ నేత బూరెడ్డి ప్రమోద్‌రెడ్డితో డిసెంబరు 20న తప్పుడు ఫిర్యాదు చేయించారని తెలిపారు. తద్వారా తన పాస్‌పోర్ట్ రెన్యువల్ కాకుండా ముత్తిరెడ్డి ఆపివేయించారని ఆరోపించారు. దీంతో తాను మూడు నెలల నుంచి ఆస్ట్రేలియాకు వెళ్లలేకపోతున్నానని తెలిపారు. తన భూమిలో నుంచి దౌర్జన్యంగా దారి తీసి, తనపైనే తప్పుడు కేసు పెట్టించారని వాపోయారు. దీనిపై పక్కా ఆధారాలు సేకరించి ఈనెల 10న జనగామ ఏఎస్పీ, ఐపీఎస్ అధికారి అంకిత్‌కుమార్ శంఖ్వార్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. కాగా.. రాజేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్పీ అంకిత్‌కుమార్ చీటకోడూరులో శనివారం క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఈ విషయంలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితో పాటు బీఆర్ఎస్ నేత బూరెడ్డి ప్రమోద్‌రెడ్డిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుపతి రెడ్డి తెలిపారు.

నేను ఎలాంటి దౌర్జన్యం చేయలేదు: ముత్తిరెడ్డి

రాజేందర్‌రెడ్డిపై తాను దౌర్జన్యం చేశానని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన ఫోన్లో మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు దౌర్జన్యం చేశానంటే జనాలు నమ్మేవారని, కానీ అధికారంలో లేనప్పుడు దౌర్జన్యం చేశానంటే ఎలా నమ్ముతారని అన్నారు. ప్రేమలతారెడ్డి 20 మంది దళితుల భూములను ఆక్రమించుకుంటే తిరిగి దళితులకు ఇప్పించానని, దీనిని మనసులో పెట్టుకొని ఈ విధంగా చేస్తున్నారని అన్నారు. రాజేందర్‌రెడ్డి పాస్‌పోర్ట్ రెన్యువల్ ఆగిపోవడంలో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు.

కేడర్‌లో.. లోకల్ జోష్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి- వరంగల్)

పార్లమెంట్ పోరు ముగియగానే స్థానిక సంస్థల పోరుకు రంగం సిద్ధమవుతోంది. ఫిబ్రవరిలోనే సర్పంచుల పదవీకాలం పూర్తి కాగా, జూన్, జూలై నెలల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగియనుంది. ఈ క్రమంలో స్థానిక ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, కోడ్ అడ్డంకిగా మారింది. దీంతో లోక్‌సభ ఎన్నికలు పూర్తి కాగానే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన ఆశావహుల్లో జోష్ నింపింది. ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తల పనితీరు ప్రతిపాదికన పోటీకి అవకాశం ఇస్తామని తమ పార్టీ కేడర్‌కు సీఎం భరోసానిచ్చారు. మరోవైపు ప్రతిపక్షాల్లోనూ ఈ ప్రకటన జోష్ నింపతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,567 మందికి సర్పంచ్, ఎంపీటీసీలు, జడ్పీటీసీ పదవులు రానుండటంతో పాటు ప్రభుత్వ నామినేటెడ్ పదవులు కూడా కేడర్‌ను ఊరిస్తున్నాయి.

జూలైలో స్థానిక సమరం

పార్లమెంట్ ఎన్నికల్లో తమ నేతల విజయాల కోసం మండుటెండలో శ్రమిస్తున్న కేడర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి చల్లని కబురు చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తి కాగానే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటన చేశారు. మే 13న తెలంగాణలోని లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుండగా జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఆ తరువాత ఎన్నికల కోడ్ ముగుస్తుంది. ఈ నేపథ్యంలో సీఎం చేసిన ప్రకటన ప్రకారం జూలైలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందనే అభిప్రాయాలున్నాయి. అయితే ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1,688 గ్రామ పంచాయతీలకు ఫిబ్రవరి 1వ తేదీన పదవీకాలం ముగిసింది. అయితే బీసీ జనాభా లెక్కలు తేలకపోవటంతో పాటు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలను వాయిదా వేశారు. గ్రామ పంచాయతీలకు పర్సన్ ఇంచార్జ్‌లుగా అధికారులను ప్రభుత్వం నియమించింది. జూలై నెల మొదటి వారంలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తి కానుంది. దీంతో సర్పంచ్ స్థానాలతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు కూడా జూలై, ఆగస్టుల్లో రెండు, మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,688 గ్రామ పంచా యతీలు ఉండగా, కొత్తగా ఏర్పడిన మండలాలతో కలిపి 74 జడ్పీటీసీ పదవులకు, 805 ఎంపీటీసీ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,567 మందిని పదవులు వరించనున్నాయి. ఇటీవల కొత్తగా భూపాలపల్లిలో గోరికొత్తపల్లి, మహబూబాబాద్ జిల్లాలో ఇనుగుర్తి, సిరోలు మండలాలు ఏర్పడ్డాయి. వీటిలో కొత్తగా

లోక్‌సభ పోరు తరువాత స్థానిక సమరం

మండల ప్రాదేశిక నియోజకవర్గం (ఎంపీటీసీ) స్థానాలను పెంచే అవకాశం ఉంది. ఎంపీటీసీల సంఖ్య మరింత పెరగనుంది. అలాగే 2009 నుంచి ములుగు జిల్లా మంగపేట మండలంలో 115 ఎంపీటీసీ స్థానాలకు, 25 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు లేవు. ఈసారి వీటికి కూడా ఎన్నికలు జరగనున్నాయి. అలాగే వచ్చే జనవరి మునిసిపాలిటీల పదవీ కాలం పూర్తికానుంది. ఫిబ్రవరిలో సహకార సంఘాల పదవీకాలం ముగిసి పోనుంది. వీటికి కూడా ఎన్నికలు నిర్వహిస్తే మునిసి పల్ కౌన్సిలర్లు, మునిసిపల్ చైర్మన్లు కూడా ద్వితీయ శ్రేణి నేతలకు దక్కనున్నాయి. అలా గే సహకార సంఘం ఎన్నికల్లో గెలిచిన డైరెక్టర్లకు పీఎసీఎస్ సొసైటీ చైర్మన్లు అవకాశాలు రానున్నాయి.అలాగే పీఎసీఎస్ చైర్మన్ల నుంచి డీసీసీబీ డైరెక్టర్‌గా, చైర్మన్‌గా, ఓడీసీఎంఎస్ డైరెక్టర్, చైర్మన్ లాంటి పదవులు జిల్లా స్థాయి నేతలకు లభించనున్నాయి. సర్పంచు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తరువాత మునిసిపాలటి, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించి మార్చి వరకు అన్ని రకాల ఎన్నికలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఆ తరువాత నుంచి పరిపాలనపై పూర్తిస్థాయిలో ప్రభుత్వం దృష్టిపెట్టనుంది. కాగా, లోక్‌సభ ఎన్నికల

మిగతా 7వ పేజీలో..

- జూలైలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్
- లోక్‌సభ ఎన్నికల్లో పనితీరు ప్రాతిపదికనే అవకాశాలన్న సీఎం
- జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులు, ఇందిరమ్మ కమిటీలపై ఆశలు
- ప్రతిపక్ష నేతల్లోనూ హుషారు
- ఉమ్మడి జిల్లాలో 2,567 మందికి స్థానిక పదవులు

జిల్లా	సర్పంచులు	ఎంపీటీసీ	జడ్పీటీసీ
వరంగల్	323	134	11
హనుమకొండ	208	129	12
భూపాలపల్లి	241	117	12
ములుగు	174	87	09
మహ-బాద్	461	198	18
జనగామ	281	140	12
మొత్తం	1,688	805	74

నామినేటెడ్ పదవులు.. ఇందిరమ్మ కమిటీలు

డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టిపెట్టింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు చెందిన ఆరుగురికి వివిధ స్థాయిలో కార్పొరేషన్ పదవులు లభించాయి. అయితే జిల్లా స్థాయి, వ్యవసాయ కమిటీలు, ఆలయ కమిటీలను నియమించాల్సి ఉంది. వీటన్నింటిని కూడా లోక్‌సభ ఎన్నికల తరువాత నియమిస్తామని సీఎం ప్రకటించటంతో కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ నింపినట్లైంది. అలాగే ప్రభుత్వం చేపట్టే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు, వాలంటీర్ల నియామకం చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. దీంతో ప్రతి గ్రామం నుంచి పది మందికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలకు ఇందిరమ్మ కమిటీలు, వలంటీర్ల పదవులు లభించే అవకాశం ఉంది. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో పని చేసిన తీరును బట్టే పదవులు ఇస్తామని సీఎం కాంగ్రెస్ కార్యకర్తలకు లింకు పెట్టడంతో ఎంపీ అభ్యర్థుల గెలుపునకు శ్రమించక తప్పని పరిస్థితి ఏర్పడిందనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థులుగా వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి కడియం కావ్య, మహబూబాబాద్ స్థానం నుంచి బలరాంనాయక్ పోటీ చేస్తున్నారు. దీంతో వీరి గెలుపు బాధ్యతలను సీఎం పరోక్షంగా కార్యకర్తలపై భుజస్కంధాలపై పెట్టారన్న చర్చ జరుగుతోంది.

కొనుగోళ్లపై సస్పెన్స్!



జనగామ మార్కెట్‌కు వచ్చిన ధాన్యం కుప్పలు

జనగామ మార్కెట్‌లో కాంటాలకు వ్యాపారులు దూరం

కేసుల నమోదు, హమాలీల సమస్యతో వెనుకడుగు

ధాన్యానికి మద్దతు ధర చెల్లించలేమని స్పష్టం

సోమవారం నుంచి కాంటాలు పెట్టడం కష్టమే

వ్యాపారులతో మార్కెటింగ్ డీడీ చర్చలు విఫలం

జనగామ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం, ఇతర పంట ఉత్పత్తుల కొనుగోలుపై సస్పెన్స్ నెలకొంది. ఈనెల 10న జరిగిన ఘటన నేపథ్యంలో ట్రేడర్లు కొనుగోళ్లకు దూరంగా ఉన్నారు. తమపై పెట్టిన కేసులను ఎత్తివేసి హమాలీల సమస్యను పరిష్కరించే వరకు కొనుగోళ్లు జరపబోమని భీష్మించుకుకూర్చున్నారు. ఇదే డిమాండ్‌పై ఈనెల 11న మార్కెట్ కార్యదర్శికి సైతం ముందస్తు నోటీసును జారీ చేశారు. ధాన్యంతో పాటు మక్కలు, చింతపండు లాంటి ఇతర ఉత్పత్తుల కొనుగోళ్లను సైతం ట్రేడర్లు నిలిపివేశారు. దీంతో అధికారులు తల పట్టుకోవాల్సి వస్తోంది. జనగామ మార్కెట్‌కు ఇప్పటికే మక్కలు, చింతపండు రావడం ప్రారంభమైంది. ఈనెల 11 నుంచి ఆదివారం వరకు జనగామ మార్కెట్‌కు నాలుగు రోజుల పాటు వరుసగా సెలవులు వచ్చాయి. సెలవుల తర్వాత సోమవారం మార్కెట్‌లో కొనుగోళ్లు జరగాల్సి ఉంది. కానీ.. ట్రేడర్లు ముందుకు రాకపోవడంతో కొనుగోళ్లు నిలిచిపోయే అవకాశం కనిపిస్తోంది.

ట్రేడర్లతో మార్కెటింగ్ డీడీ చర్చలు

జనగామ మార్కెట్‌లో కొనుగోళ్లకు దూరంగా ఉంటామని ట్రేడర్లు ఇచ్చిన నోటీసులపై మార్కెటింగ్ శాఖ అధికారులు శనివారం ట్రేడర్లతో చర్చలు జరిపారు. ఈనెల 10న మార్కెట్‌లో జరిగిన రైతుల ఆందోళన నేపథ్యంలో ముగ్గురు ట్రేడర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై రాష్ట్రస్థాయిలో పెద్ద చర్చ జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి సైతం స్పందించి శుక్రవారం రాష్ట్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రేడర్లు, మిల్లర్లు మద్దతు ధరకే ధాన్యాన్ని కొనాలని, లేదంటే బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో పాటు ట్రేడర్లు ఇచ్చిన ముందస్తు నోటీసులపై మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. జనగామ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ట్రేడర్లతో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజునాయక్ శనివారం చర్చలు నిర్వహించారు. కనీస మద్దతు ధరకు(ఎంఎస్‌పీ) ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ట్రేడర్లకు సూచించారు. దీనిపై ట్రేడర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఎస్‌పీ ప్రకారం కొంటే తమకు గిట్టుబాటు కాదని తేల్చి చెప్పారు. ప్రస్తుతం వడ్లకు బహిరంగ మార్కెట్‌లో ధర లేదని అన్నారు. దీంతో ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటుందని, మక్కలు, చింతపండు తదితర ఉత్పత్తులను కొనాలని రాజునాయక్ సూచించగా ట్రేడర్లు అంగీకరించలేదు. తమపై పెట్టిన కేసులను ఎత్తివేయడంతో పాటు మార్కెట్‌లో ఉన్న హమాలీల సమస్యను పరిష్కరించే వరకు తాము ఎలాంటి కొనుగోళ్లు జరపబోమని చెప్పారు. దీంతో చేసేదేమీ లేక సమస్యను కలెక్టర్, అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మొత్తానికి సమస్య పెండింగ్‌లోనే ఉంది.

సోమవారం నుంచి కాంటాలు పెడతారా..?

కొనుగోళ్లకు ట్రేడర్లు దూరంగా ఉండడం, కచ్చితంగా ఎంఎస్‌పీకే కొనుగోలు చేయాలని అధికారులు తేల్చి చెప్పడంతో సోమవారం నుంచి కాంటాలు జరుగుతాయా లేదా అన్న సందిగ్ధత నెలకొంది. మార్కెట్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ధాన్యం తప్ప మిగతా ఉత్పత్తులను ట్రేడర్లు కొనాల్సి ఉంటుంది. ఈనెల 10న జరిగిన ఘటన తర్వాత అధికారులు ట్రేడర్లను పిలిచి మాట్లాడడంతో క్వింటాకు రూ.30 అదనంగా ఇస్తామని చెప్పి ఆ రోజు వచ్చిన ధాన్యాన్ని మొత్తం కాంటా వేశారు. తర్వాత వరుసగా నాలుగు రోజులు సెలవులు వచ్చాయి. దీంతో మార్కెట్‌కు పెద్దగా ధాన్యం రాలేదు. సోమవారం పెద్ద మొత్తంలో ధాన్యం మార్కెట్‌కు రానుంది. వర్షాల భయంతో రైతులు కొనుగోలు కేంద్రాల కంటే ట్రేడర్లకే ఎంతో కొంతకు అమ్ముకోవడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో సోమవారం పెద్ద మొత్తంలో వచ్చే వరి ధాన్యంతో పాటు మక్కలు, చింతపండు సైతం ట్రేడర్లు కొనకపోతే మార్కెట్‌లోనే పేరుకుపోయే అవకాశం ఉంది. దీనిపై అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో చూడాలి.

ఎంఎస్‌పీ ప్రకారమే కొనుగోలు చేయాలి

- రాజునాయక్, డిప్యూటీ డైరెక్టర్, మార్కెటింగ్ శాఖ



రైతులు తెచ్చిన ధాన్యాన్ని కచ్చితంగా కనీస మద్దతు ధరకే కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా జనగామ మార్కెట్‌లో ట్రేడర్లతో నిర్వహించిన సమావేశంలోనూ వారికి ఇదే విషయాన్ని చెప్పాం. ఎంఎస్‌పీ ప్రకారం కొంటే తమకు గిట్టుబాటు కాదని చెప్పారు. వరి కాకుండా మిగిలిన మక్కలు, చింతపండు లాంటివి కొనుగోలు చేయాలని చెప్పాం. దానికి కూడా వారు ముందుకు రాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అంతవరకు రైతులకు ఇబ్బందులు కలగకుండా మార్కెట్‌లోనే పీఏసీఎస్, ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. అవసరమైనన్ని ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాం. రైతులు తేమ, తాలు లేకుండా ధాన్యాన్ని తీసుకువచ్చి విక్రయించుకోవచ్చు.

సీఎంతో కడియం శ్రీహరి భేటీ



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, టీపీసీసీ నేత ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 13: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో గాంధీభవన్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కడియం, ఇందిర ఇద్దరు సమన్వయంతో పనిచేసి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని సీఎం వారికి సూచించారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ అంకిత్‌కుమార్ తదితరులు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 13: అగ్నిమాపక వారోత్సవాలు ఏప్రిల్ 14 నుంచి నిర్వహిస్తున్నట్లు జనగామ అగ్నిమాపక కేంద్రాధికారి కె.మధుకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో ఏసీపీ అంకిత్‌కుమార్ చేతుల మీదుగా కరపత్రాలు, వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14న ముంబయి విక్టోరియా డాక్ యార్డులో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా 66 మంది అగ్నిమాపక దళ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని, వారిని స్మరించుకుంటూ యేటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు తెలంగాణ రాష్ట్ర విపత్తుల స్పందన అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

టీమ్‌వర్క్ లేకనే విద్యుత్ ప్రమాదాలు

తొందరపాటు పనులు చేయొద్దు


కార్మికులకు ఎస్ఈ వేణుమాధవ్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ వేణుమాధవ్


స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 13: కార్మికుల వద్ద టీమ్ వర్క్ లేకపోవడం వల్లనే విద్యుత్ ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నారని విద్యుత్‌శాఖ ఎస్ఈ వేణుమాధవ్ అన్నారు. శనివారం ఆయన డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల పైన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రాణాల కంటే కార్మికులకు ఏదీ ఎక్కువ కాదన్నారు.. తొందరపాటు పనులు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు అన్నారు. ప్రజల నుంచి సమస్య ఉందని ఫోన్ వచ్చినప్పుడు పై అధికారికి తెలియపరిచిన తరువాతనే విధులు నిర్వహించాలని, అది కూడా సిబ్బంది ఒక్కరే ఎట్టి పరిస్థితుల్లో వెళ్లకూడదన్నారు. కనీసం ఇద్దరు కార్మికులు లేకుండా విద్యుత్ పనులు చేయొద్దని సూచించారు. పనిచేసే సమయంలో కార్మికులు ఫోన్‌లో మాట్లాడొద్దన్నారు. ఫోన్ మాట్లాడుతూ ఎల్‌సీ తీసకున్నామనే భ్రమలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లి పనులు చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో ఉండే సిబ్బందికే అన్ని విషయాలు తెలిసి ఉంటాయని, కట్టర్‌లు, జేఎల్‌ఎంలు, ఎల్‌ఎంలు, లైన్ ఇన్స్‌పెక్టర్లు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రతీ కార్మికుడికి, ఉద్యోగికి కుటుంబం ఉంటుందనే విషయాన్ని గుర్తు పెట్టుకొని ప్రతీ రోజు విధుల్లో చేరాలన్నారు. ప్రతీ ఫీడర్ పరిధిలో సిబ్బంది ఆ రోజు చేయాల్సిన పనుల పైన చర్చించుకొని విధులకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఏవో జయరాజ్, డీఈలు హస్సేన్‌నాయక్, ప్రభావతి, విజయ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నీలం ఐలేష్, సెక్రటరీ నరేందర్ రెడ్డి, ఏడీఈ సత్యనారాయణ, ఏఈలు చంద్రమోహన్, శివకుమార్, రమేష్, విశ్వసాహితి, రణధీర్, రాములు, వాసం శ్రీధర్, మహేందర్ రెడ్డి, సుధాకర్, ఐలయ్య, పెద్దిరెడ్డి, కాల్‌రామ్, సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.













నాంచారమ్మ పంచకూటాలయాన్ని పునర్నిర్మించాలి


వడ్డెపల్లి, ఏప్రిల్ 13: కాకతీయరాజులు రామప్ప గుడి సమీపంలోని రామానుజపురంలో నిర్మించిన ఎరుకల నాంచారమ్మ పంచకూ టాలయం శిథిలావస్థలో ఉందని, దాన్ని పునర్నిర్మించాలని ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఎరుకల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ ఎరుకల సమాజం అభివృద్ధి కోసం రూ.500కోట్లు ఎరుకల కార్పొరేషన్‌కు కేటాయించి విద్యావంతుడైన ఎరుకల కులస్తుడినే చైర్మన్‌గా నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఆదివాసీ, గిరిజన తెగల సమస్యల పరిష్కారం కోసం ఎస్టీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు


ఈసమావేశంలో ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనేటి రాజు, కేతిరి రాజశేఖర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మద్దిల శ్రీనివాస్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు లోకిని సమ్మయ్య, రాష్ట్ర, జిల్లా నాయకులు బూనాద్రి రంజిత్‌కుమార్, బిజిలి ప్రశాంత్, దుగ్యాల రమేష్, పులిచేరు రవీందర్, పులిచేరు చంద్రయ్య, లోకిని చందర్, మానుపాటి సురేందర్, పులిచేరు చిన్న సారయ్య, వల్లకొండ ప్రభాకర్, ఓని సదానందం, కేతిరి రాజు, కుతాడి శ్రీనివాస్, రేవెల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.















అగ్గి అంటుకుంటే బుగ్గే..

- నగరంలో విరివిగా అగ్ని ప్రమాదాలు
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- కమర్షియల్ కాంప్లెక్సుల్లో ఫైర్‌సేఫ్టీ నిల్
- ఎన్‌వోసీలు తీసుకున్న దాఖలాలు లేవు
- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



వరంగల్ క్రైం, ఏప్రిల్ 13: ఉమ్మడి వరంగల్ జిల్లాలో అగ్గి అంటుకుంటే బుగ్గే అనే పరిస్థితి ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో కేవలం పదమూడుమాత్రమే ఫైర్ స్టేషన్‌లున్నాయి. వరంగల్ నగరంలో కేవలం రెండు స్టేషన్‌లు మాత్రమే ఉండటం విశేషం. నగర విస్తీర్ణంతో పాటు వ్యాపార సముదాయ భవనాలు, విద్యాకేంద్రాలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లు నిర్మాణాల సంఖ్య వేగంగా పెరుగుతున్నప్పటికీ ఫైర్‌స్టేషన్‌ల సంఖ్య పెరగలేదు. ఏజెన్సీ ఏరియాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే ఇక అంతే సంగతులు, ములుగులో ఉన్న స్టేషన్‌నుంచి వాహనం వెళ్లేలోగా జరిగే నష్టం జరిగి తీరుతుంది. ఏటూరునాగారం ఏరియాలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ పాలకులు దృష్టి సారించకపోవడం గమనార్హం. నియోజకవర్గ కేంద్రాలకే ఫైర్‌స్టేషన్‌లు పరిమితం కావడంతో ఫలితం లేకుండా పోతోంది. వరంగల్ నగరం మినహా ప్రతీ నియోజకవర్గ విస్తీర్ణం ఎటూ 50 కిలోమీటర్లకు పైగానే ఉంటుంది. ఇలా స్టేషన్‌ల సంఖ్య పెంచకపోవడం, పాత వాహనాలు, అరకొర సిబ్బంది ఉండటంతో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు నివారణ చర్యలు అంతంత మాత్రంగానే ఉండటం విశేషం. ఈక్రమంలో ఆదివారం నుంచి అగ్నిమాపక శాఖ ఆద్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తుంది.

నిబంధనలకు నీళ్లు

వరంగల్ నగరంతోపాటు పలు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు విరివిగా జరుగుతున్నాయి. వరంగల్ నగరంలో వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థల భవనాలు, ఆస్పత్రుల భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్న వారు నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు లేవు. ప్రతీ వ్యాపార సముదాయాల్లో ఫైర్ వాహనం తిరిగేలా స్థలం, ఫైర్‌సేఫ్టీ పరికరాలు, ఎమర్జెన్సీ ద్వారాలు ఇలా ఏర్పాట్లు తప్పనిసరి. అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీ తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రతీ సంవత్సరం రెన్యూవల్ చేసుకోవాలి. ఇలాంటి సౌకర్యాలులేని భవనాలే ఎక్కువగా నగరంలో ఉన్నాయి. అధికారుల చేతులు తడుపుతున్న వ్యాపారులు నిబంధనలు బుట్టదాఖలు చేస్తూ అనుమతులు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అందినంత దండుకుంటున్న అధికారులు తనిఖీలు చేసిన పాపానపోవడం లేదనే విమర్శలున్నాయి.

ఇటీవల వరంగల్‌లో జకోటియా కాంప్లెక్సులో జరిగిన అగ్ని ప్రమాదం సంఘటన, గతంలో హనుమకొండలో జుబేర్ బుక్ స్టాల్, కల్యాణలక్ష్మీ సారీ సెంటర్‌లో, కరీంనగర్ రోడ్డులోని ఒక పెట్రోల్ పంపులో జరిగిన సంఘటనలు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈ సంఘటనల్లో మూడురోజుల పాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తే కానీ మంటలు నియంత్రించలేని పరిస్థితి ఏర్పడింది. ముందస్తు చర్యలు లేకపోవడం వల్లనే అగ్ని ప్రమాదాలు నిలువరించలేని దుస్థితి ఏర్పడుతుందనే విమర్శలున్నాయి. వారోత్సవాలు నిర్వహించి చేతులు దులుపుకోవడం కాకుండా వ్యాపార సముదాయాల్లో నిత్యం తనిఖీలు చేస్తూ నిబంధనలు కఠినతరం చేయాల్సి ఉంది.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

మామిడి భగవాన్‌రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్, వరంగల్




ముందస్తు చర్యలతో అగ్ని ప్రమాదాలు జరుగకుండా నివారించవచ్చు. వ్యాపార సముదాయాలు నిర్మించేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. ఫైర్ సెఫ్టీ చర్యలు తీసుకోవాలి. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి. జిల్లా వ్యాప్తంగా అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే 8712699304, 8712699305 నంబర్లకు సమాచారం అందించాలి. ఆదివారం నుంచి వారంపాటు అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాం.

ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్

అర్హత సాధిస్తేనే పదోన్నతులు

ప్రత్యేక పరీక్ష నిర్వహించాలంటున్న టీచర్లు



జనగామ కల్చరల్, ఏప్రిల్ 13: టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పాసైతేనే పదోన్నతులకు అర్హులని ఎన్‌సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) కొత్త నిబంధనలు విధించడంతో ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెన్షన్ పట్టుకుంది. ఎప్పుడో ఉద్యోగాలు పొందిన తాము ప్రస్తుతం పదోన్నతులు పొందేందుకు టెట్ తప్పనిసరి పాస్ కావాలనే నిబంధన పెట్టడం ఏమిటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. టెట్ అర్హత సాధించడం ఇప్పుడు సాధ్యమయ్యే పని కాదని, తమ కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. కాగా రాష్ట్ర విద్యాశాఖ మాత్రం డీఎడ్, బీఎడ్ అభ్యర్థులతో పాటే ప్రస్తుత ఉపాధ్యాయులు కూడా టెట్ రాయాల్సిందేనని అంటోంది. ఏప్రిల్ నెలలో టెట్ నిర్వహించిన తర్వాతే ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు ఉంటాయని పేర్కొంటోంది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

టెట్ నిర్వహణ ఇలా..

టెట్‌ను తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. పూర్తి పేపరు 150 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత సాధించాలంటే ఓసీలు 60 శాతం, బీసీలు 50 శాతం, ఎస్సీలు 40 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. పేపర్ - 1 ఉత్తీర్ణత కావాలంటే చైల్డ్ డెవలప్‌మెంట్, తెలుగు, ఇంగ్లీషు, గణితం, పర్యావరణానికి సంబంధించిన అంశాలుంటాయి. పేపర్ - 2 లో కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. ఈ అంశాలన్నీ చదవడం ఇబ్బందికరమని ఉపాధ్యాయులు అంటున్నారు. ఎప్పుడో ఉద్యోగాలు పొందిన వారు ఇప్పుడు టెట్ ఉత్తీర్ణత ఉండాలని చెబుతుండడంతో ఉపాధ్యాయులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో అవన్నీ తాము చదవలేమని, తమకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

2009 లోనే టెట్ ఉత్తర్వులు

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే అంటే 2009 లోనే ప్రభుత్వం టెట్ ఉత్తర్వులు జారీ చేసింది. 2010లో కొత్తగా డీఎస్సీ రాయాలనుకునేవారికి టెట్ నిర్వహించింది. కాని ఇన్‌సర్వీస్‌లో ఉన్నవారు కూడా టెట్ రాయాలని చెప్పలేదు. ఆ తరువాత 2013 లోనూ, 2015 లోనూ ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టింది. ఈ పదోన్నతుల్లో వారికి టెట్ మినహాయింపు ఇచ్చింది. అంతెందుకు ఇటీవల జరిగిన మల్టిజోన్ స్థాయి బదిలీల్లో కూడా టెట్ కు ప్రాధాన్యత కల్పించలేదు. మల్టిజోన్-1 లో జరిగిన బదిలీలు పొందిన వారికి టెట్ అడగలేదు. ఇతర కారణాల చేత మల్టిజోన్-2 లో బదిలీలు నిలిచిపోయాయి. ప్రస్తుతం మల్టిజోన్-2 లో బదిలీలు పొందేవారు కూడా టెట్ రాయాలనడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లాలో దాదాపు అన్ని యాజమాన్యాలలో కలిపి 2500 మంది ఉపాధ్యాయులున్నారు. వీరిలో దాదాపు 2000 మంది ఉపాధ్యాయులు టెట్ అర్హత లేనివారే.

హేతుబద్ధత ఏది?

అసలు టెట్ నిర్వహణకు హేతుబద్ధత లేదని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. ఉపాధ్యాయ ఉద్యోగానికి డీఎస్సీ రాస్తే సరిపోతుందని, డీఎస్సీకి అర్హులైతే చాలని, ఉద్యోగార్హతకు, డీఎస్సీకి మధ్య ఈ టెట్ హేతురహితమని అంటున్నారు. ఎక్కడా లేని విధంగా టెట్ అర్హతకు ఓసీ, బీసీ, ఎస్సీలకు రకరకాల మార్కులను నిర్ణయించడం సరికాదని చెబుతున్నారు. కాగా పీఎస్ హెచ్‌ఎంలు ప్రైమరీ స్కూళ్లలో బోధిస్తారని, విధులు మాత్రం ఎస్‌జీటీ స్థాయిలో ఉంటాయని, అటువంటి వారు లెవెల్-1 పరీక్ష రాయాలా, లెవెల్-2 పరీక్ష రాయాలా అనేది ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని అంటున్నారు. పండిట్ టీచర్లు పేపర్-1 కానీ పేపర్-2 కానీ రాయలేరని, ఎందుకంటే వారికి సంబంధించిన సిలబస్ ఆ పేపర్లలో ఉండదని, వారికి ప్రత్యేకమైన ప్రశ్నాపత్రం ఉండాలని, అలాంటి వారు పదోన్నతులు పొందాలంటే ఎలా అనేదానికి విద్యాశాఖ స్పష్టత ఇవ్వలేదని విమర్శిస్తున్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి..

దొమ్మాట శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ప్రస్తుతం టెట్‌కు సమాయత్తమవుతున్న వారితో పోటీపడి పరీక్ష రాసే పరిస్థితులు కల్పించొద్దు. టెట్ నిర్వహణ హేతురహితంగా ఉంది. పీఎస్‌హెచ్‌ఎంలు, పీజీ హెచ్‌ఎంలు, పండిట్లు ఏ పరీక్ష రాయాలనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. తప్పనిసరి పరిస్థితుల్లో టెట్ నిబంధన అమలు చేస్తే 2010 తరువాత నియామకమైన ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి.

కేడర్‌లో.. లోకల్ జోష్

5వ పేజీ తరువాయి

తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు రావటంతో క్యాడర్‌ను పదవులు ఊరిస్తున్నాయి.

ప్రతిపక్షాల్లోనూ ఉత్సాహం..

లోక్‌సభ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఫైట్ ఉంటుందని సీఎం ప్రకటించటంతో ప్రతిపక్షాల్లోనూ ఉత్సాహం కనిపిస్తోంది. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 90శాతం వరకు బీఆర్‌ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. ములుగు, భూపాలపల్లి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు దీటుగా కాంగ్రెస్ జడ్పీటీసీలు, ఎంపీ టీసీలు విజయం సాధించారు. చాలా చోట్ల బీజేపీకి చెందిన సర్పంచులు, ఎంపీ టీసీలు కూడా గత ఎన్నికల్లో విజయం సాధించారు. అయితే ఉమ్మడి వరం గల్‌లోని ఆరు జడ్పీ చైర్మన్లు కూడా బీఆర్‌ఎస్ పరిధిలోనే ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోవటంతో నేతలు, కార్యకర్తలు వలస బాట పడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలో చేరుతున్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కూడా బలపడుతోంది. ఈ నేపథ్యంలో లోక్‌సభలో తమ అభ్యర్థి గెలిస్తే, లోకల్ బాడీ ఎన్నికల్లో తమకు అవకాశం లభిస్తుందనే ఆశతో ప్రతిపక్ష బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తలు కూడా ఉన్నారు. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటనపై కాంగ్రెస్ క్యాడర్‌తో పాటు ప్రతిపక్షాల కార్యకర్తలు కూడా జోష్‌లో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

మార్కెట్లో వేలంలో మారిన సమయపాలన

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 13: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇబ్బంది పడకుండా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సోమవారం నుంచి జూన్ 15 వరకు వేలం పాటల సమయాలలో మార్పులు చేసినట్లు వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మార్కెట్లో మిర్చి బీటు ఉదయం 7.05 గంటలకు, పత్తి బీటు 8.05 గంటలకు, పల్లికాయ బీటు 8.15గంటలకు, పసుపు బీటు 8.30 గంటలకు, అపరాల బీటు 8.45 గంటలకు మారినట్లు తెలిపింది. అలాగే ఏప్రిల్ 24 నుంచి జూన్ 12 వరకు ప్రతీ బుధవారం మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ తెలిపింది. రైతులు, కార్మికులు, అడ్తి, ఖరీదుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆ ప్రకటనలో కోరింది.

17 నుంచి ఉచిత కోచింగ్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 13: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు కలిపి నిర్వహించేకామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీజీఈటీ)లో ఎంఎస్సీ కెమిస్ట్రీ ప్రవేశ పరీక్షకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులకు హనుమకొండ కాకతీయ ప్రభుత్వ కళాశాల రసాయన శాస్త్రత విభాగం అధ్వర్యంలో ఆన్‌లైన్ /ఆఫ్‌లైన్ (బ్లెండెడ్ విధానం)లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజిరెడ్డి, కేడీసీ రసాయశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి.రమేశ్ తెలిపారు. ఉచిత శిక్షణ ఏప్రిల్ 17 నుంచి ప్రారంభం అవుతుందని, 60రోజులపాటు జరుగుతోందని తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఏ కళాశాలకు చెందిన వారైన ఉచిత శిక్షణకు హాజరు కావచ్చునని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ 98669-62589 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

21న జిల్లాస్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 13: తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన అండర్-17 ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి బాలబాలికల చెస్ పోటీలను టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ ప్రతినిధి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే బాలబాలికలు 1 జనవరి 2008 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. అదే విధంగా 1 జనవరి 2017లోపు జన్మించిన 7ఏళ్ల బాలబాలికలు ఈ చెస్‌పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన వివరించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బాలబాలికలకు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90595 22986లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బెల్టు షాపులపై దాడి

వరంగల్ క్రైం, ఏప్రిల్ 13: జిల్లాలోని పలు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం బెల్టు షాపులపై దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.24వేల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో రూ.6760, సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెపల్లిలో రూ.7360, ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కంపేటలో రూ.5140, అగ్రంపహాడ్‌లో రూ.4560 విలువ కలిగిన మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఏసీపీ ఎ.మధుసూధన్ ధ్రువీకరించారు.

ఒలింపియాడ్‌లో బాలయేసుకు స్టేట్ ర్యాంకులు


ప్రశంసాపత్రాలను అందుకున్న బాలయేసు విద్యార్థులు

దేవరుప్పుల, ఏప్రిల్ 13: మండలకేంద్రంలోని బాలయేసు పాఠశాల విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఫిబ్రవరి నెలలో నిర్వహించిన గ్రైడియర్ ఒలింపియాడ్ ఎగ్జామ్స్‌లో స్టేట్ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యాజమాన్యం శనివారం ప్రశంసాపత్రాలను అందజేసింది. ఆలిండియా లెవల్‌లో మొత్తం 1,85,000మంది విద్యార్థులు పాల్గొనగా, బాలయేసు నుంచి 3నుంచి 10తరగతుల వరకు విద్యార్థులు 129మంది పరీక్షలు రాశారు. ఇద్దరు విద్యార్థులు స్టేట్ ర్యాంకులు, ముగ్గురు విద్యార్థులు జిల్లా ర్యాంకులు సాధించారు. దావుల అమృత (6వ తరగతి) స్టేట్‌లో 7వ ర్యాంక్, ఐలబోయిన యస్విన్ (6వ తరగతి) స్టేట్ 11వ ర్యాంకు, కున్సోత్ ఝాన్సీబాయ్ (10వ తరగతి) జిల్లా మొదటి ర్యాంకు, వేల్పుల శ్రీనిధి (7వ తరగతి) జిల్లా రెండవ ర్యాంకు, గుగులోతు చాందినీ (5వ తరగతి) జిల్లా మూడవ ర్యాంకు సాధించినట్లు కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాలా యాజమాన్యం అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాజా, మదన్‌మోహన్, మహేష్, అనిత, మాధవి, ఉష, సరిత, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

జఫర్‌గడ్, ఏప్రిల్ 13: మండలంలోని తిమ్మంపేటలో విద్యుత్ షాక్‌కు గురై నూకల యాకయ్య (52) అనే వ్యక్తి మృతి చెందాడు. గొర్రెలు, మేకలను మేపుకోవడంతో పాటు వ్యవసాయం చేసుకుంటున్న యాకయ్య శనివారం ఇంటి వద్ద నీటి మోటారు విద్యుత్ వైరును పక్కకు జరిపే క్రమంలో షాక్ కొట్టి కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే 108 ద్వారా ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యలోనే చనిపోయాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఎస్ఐ శీలం రవియాదవ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, యాకయ్య మృతదేహాన్ని జఫర్‌గడ్ జడ్పీటీసీ ఇల్లందుల బేబీ- శ్రీనివాస్ దంపతులు, మాజీ సర్పంచ్ నూకల మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు.

ధాన్యం కొనుగోళ్లలో అవినీతికి పాల్పడితే చర్యలు

అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

జనగామ కల్చరల్, ఏప్రిల్ 13: ధాన్యం కొనుగోళ్లలో అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ హెచ్చరించారు. శనివారం ఆయనే కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లు, లారీ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సివిల్ సప్లయిస్ కమిషనర్ డీఎస్.చౌహాన్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా గన్నీ సంచులు ఉండేలా చూడాలన్నారు. రైతులకు ఎక్కడ కూడా ఎలాంటి సమస్య రావొద్దన్నారు. ధాన్యం కొనుగోళ్లలో తరుగు, తదితర అవకతవకలు, అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైస్ మిల్లర్లు ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన సీఎంఆర్ వానాకాలం బియ్యాన్ని సకాలంలో అప్పగించాలన్నారు. ధాన్యం లోడింగ్ వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రం వద్దకు లారీలను సకాలంలో పంపించాలని లారీ కాంట్రాక్టర్లను ఆదేశించారు. జిల్లాలో సీఎంఆర్ డెలివరీ 35 శాతంగా ఉందన్నారు. సమావేశంలో డీసీఎస్ఓ రోజారాణి, డీఎం సివిఎస్.ప్రసాద్, డీటీ సీఎస్ శ్రీనివాస్, దేవా, రైస్ మిల్లర్లు, లారీ కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రాములోరి ఉత్సవాలు ప్రారంభం


వల్మిడి సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవాలను నిర్వహిస్తున్న అర్చకులు

పాలకుర్తి, ఏప్రిల్ 13: ఈనెల 17న వల్మిడి గుట్టపై నిర్వహించనున్న సీతారాముల కల్యాణం సందర్భంగా శనివారం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈవో లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో గ్రామంలోని రామాలయం నుంచి సీతా రాముల విగ్రహాలను ఆలయ అధికారులు, గ్రామస్థులు మేళతాళాలతో పండితులు, అర్చకులు వేద మంత్రాల మధ్య వైభవోపేతంగా గుట్టపైకి తీసుకువచ్చారు. సేవా కాలం, నివేదన, తీర్థగోష్ఠి, నిర్వహించారు. భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించారు.

ఘన్‌పూర్ ఆలయంలో భక్తులకు ఏర్పాట్లు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పూరాతన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే కల్యాణోత్సవంలో భక్తులకు ఇబ్బందులు కల్గకుండా సకల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ పండుగ భద్రయ్య తెలిపారు. శనివారం ఆలయ పరిసరాలను చదును చేసే కార్యక్రమాన్ని చేబట్టారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున భక్తుల విడిది కోసం ఆలయం చుట్టూరా చలువ పందిర్లను ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ యేటా ఉత్సవాలకు వచ్చే భక్తుల సంఖ్య రెట్టింపు అవుతోందన్నారు. సుమారు 10వేల మంది భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎడమ కుమార్, బూర్ల శ్రీను, అనూష-రమేష్, యాదవరెడ్డి, పొన్న రఘు గౌడ్, ఎడమ కట్టమల్లు, నల్ల రాజయ్య, తాటికొండ సంపత్‌కుమార్‌యాదవ్, పాలకుర్తి నాగరాజు, రాంనర్సు నలిమెల ఎలియా, అనిల్, నరేందర్ పాల్గొన్నారు.

తిరుమల నాథుని ఆలయంలో..

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ వెనక ఉన్న పురాతన తిరుమలనాథ స్వామి దేవాలయంలో ఈ నెల 17న సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కల్యాణంలో పాల్గొనే వారు 9390124942, 9866211638, 8686919853 సెల్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి


లింగాలఘణపురంలో సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ కార్యకర్తలు

లింగాలఘణపురం, ఏప్రిల్13: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మారెపెల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం లింగాలఘణపురంతో పాటు బండ్లగూడెం, గుమ్మడవెల్లి, జీడికల్, సిరిపురం గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమపోరాటమే స్ఫూర్తిగా లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుకోసం ప్రతీ కార్యకర్త ఓ సైనికుడిగా ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో క్లస్టర్ ఇంచార్జీలు కర్రె శ్రీనివాస్, జూకంటి శ్రీశైలం, నీల యాదగిరితో పాటుగా మండల నాయకులు ఏదునూరి వీరయ్య, కేలపు లక్ష్మినారాయణ, గట్టగల్ల శ్రీహరి పాల్గొన్నారు.

భారీ మెజారిటీ అందించాలి..

చిలుపూర్: వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మారెపల్లి సధీర్‌కుమార్‌కు భారీ మెజారిటీని అందించే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏడవెళ్లి కృష్ణారెడ్డి, కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ మేక సంతోష్ పిలుపునిచ్చారు. శనివారం వెంకటాద్రిపేట, చిలుపూర్, దేశాయితండా, వెంకటేశ్వర్లపల్లి, తీగలతండా తదితర గ్రామాల్లో వారు పర్యటించారు. కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన పలు వ్యూహాలను వారికి వివరించారు. వచ్చే ఎన్నికల్లో సుధీర్‌కుమార్ విజయానికి కృషి చేసి కడియంకు తగిన బుద్ధి చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు జనగామ యాదగిరి, తోకల లక్ష్మారెడ్డి, తుప్పరి ప్రవీన్, మాచెర్ల ప్రవీన్, నారగోని రాజుగౌడ్, మాచెర్ల స్వామి, ఉడ్దెమారి బాలరాజు, తోట రాజయ్య, మాచెర్ల శ్రీనివాస్, మద్దూరు వైస్ ఎంపీపీ మలిపెద్ది మల్లేషం, బొల్లు చంద్రమౌళి, సుదర్శన్, మహేశ్, తిరుపతి, కనకరాజు, మంద సుమన్‌రెడ్డి, భూక్య రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

- టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో వక్తలు


జనగామలో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న సంఘం నాయకులు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 13: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో 11వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామజిక స్పృహ అనే లక్ష్యాలతో టీఎస్‌యూటీఎఫ్ రాజీ లేని పోరాటాలు చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడానికి కృషి చేయాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో బడిబాట ద్వారా గ్రామాల్లో గడపగడపకూ తిరిగి విద్యార్థుల నమోదుకు కృషి చేయాలన్నారు. తొలుత సీనియర్ ఉపాధ్యాయులు టీఎస్‌యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి పతాక వందనం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు, కృష్ణ, శ్రీహరి, శ్రీనివాస్, కనకయ్య, ఉప్పలయ్య, దామోదర్‌రెడ్డి, భాస్కర్, నర్సింహులు, సద్గుణచారి, నర్సింహులు, రవీందర్, రాజమల్లు, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రాజీవ్ చౌరస్తాలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు టి.హేమలత పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్ ఉద్యమిస్తుందని అన్నారు. కార్యక్రమంలో శాగ నర్సయ్య, చిక్కుడు శ్రీనివాస్, తోట వెంకట్, నేతి కొండయ్య, వీరమల్ల బాబయ్య, రమేష్, హైమావతి, ప్రసాద్, విజయరాణి, తమ్మి మధు, కూటికంటి శ్రీనివాస్, యాదగిరి, శ్రీకాంత్, రాము ఉన్నారు.

వల్మిడి ఆలయానికి భక్తుల పల్లకి


ఆలయానికి పల్లకీని బహూకరిస్తున్న భక్తులు

పాలకుర్తి, ఏప్రిల్ 13: మండలంలోని వల్మిడిలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సీత రామచంద్రస్వామి దేవస్థానానికి వరంగల్‌కు చెందిన భక్తులు రూ. 1. 50 లక్ష విలువ గల పల్లకీని, వాటర్ కూలర్‌ను బహూకరించారు. హనుమకొండ అడ్వకేట్స్ కాలనీకి చెందిన పింగిలి సంజీవ రెడ్డి, కవిత రూ.లక్ష విలువ చేసే పల్లకీని, దాసరి శ్రీనివాస్‌కల్పనా దేవి దంపతులు వాటర్ కూలర్‌ను శనివారం ఆలయ సూపరింటెండెంట్ వెంకటయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో శ్రీ సీత రాములను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

పార్కులో సౌకర్యాలు కల్పించాలి

ఎమ్మెల్యే యశస్విని రెడ్డి


తొర్రూరు పార్కులో మాట్లాడుతున్న యశస్విని రెడ్డి

తొర్రూరు, ఏప్రిల్ 13: పార్కులో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆమె తొర్రూరులోని యతిరాజారావు పార్కును సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. మునిసిపల్ అధికారులు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడంలేదని ప్రజలు తెలపడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కు ఆవరణలో స్విమ్మింగ్ పూల్, టాయిలెట్స్ తదితర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగినా అధికారులపై చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన వద్దకు వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు పెదగాని సోమయ్య, వింజూరి సుధాకర్, ఉపేందర్, వాకర్స్, పిల్లలు తదితరులు ఉన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా

శ్రీనివాస్ గౌడ్



కొడకండ్ల, ఏప్రిల్ 13: మండలకేంద్రానికి చెందిన ముంజాల శ్రీనివాస్ గౌడ్ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తనకు ఈ పదవిని కట్టబెట్టిన బీజేపీ పెద్దలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. బీసీలను అందరినీ ఏకం చేయడమేకాక పార్టీ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు.

గూడూరులో వాహనాల తనిఖీ

పాలకుర్తి, ఏప్రిల్ 13: మండలంలోని గూడూరు చౌరస్తాలో సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసుల ఆధ్వర్యంలో సీఐ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. మైనర్‌లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. కొంత మంది యువకులు స్పీడ్ డ్రైవింగ్ చేస్తున్నారని, వారిని గమనిస్తున్నామని అన్నారు. ఆయన వెంట ఎస్సైలు సాయి ప్రసన్నకుమార్, లింగారెడ్డి, యాకూబ్ హుస్సేన్, శ్రీనివాస్, యాకయ్య, సంపత్ ఉన్నారు.

అంగన్‌వాడీ దినోత్సవం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఏప్రిల్ 13: స్టేషన్‌ఘన్‌పూర్ ముదిరాజ్ కాలనీలో శనివారం అంగన్‌వాడీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 3, 4 ఏళ్ల చిన్నారులకు వర్క్ బుక్స్ ప్రదర్శించారు. వారికి ఆట పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పిల్లల అభివృద్ధిని అంచనా వేశారు. అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన బోధనా, అభ్యసనా కృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ రాణి, ప్రశాంత్, యాదగిరి, ఎల్లయ్య, వెంకటయ్య, గట్టమ్మ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు

గిర్నిగడ్డ కమ్యూనిటీ హాల్‌కు మార్పు

జనగామ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జనగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అధికారులు మరోచోటకు మారుస్తున్నారు. గత కొంతకాలంగా జనగామ జైలు పక్కన అద్దె భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగింది. కాగా.. అద్దె భవనం కావడం, రికార్డుల నిర్వహణకు స్థలం సరిపోకపోవడంతో కార్యాలయాన్ని తరలించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో జనగామలోని గిర్నిగడ్డలో ఉన్న మునిసిపాలిటీకి చెందిన కమ్యూనిటీ హాల్(పాత ఖజానా శాఖ కార్యాలయం)కు మారుస్తున్నారు. కాగా.. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కమ్యూనిటీ హాల్‌లో చేస్తున్నారు. సోమవారం నుంచి కొత్త కార్యాలయంలోనే సేవలు అందిస్తామని సబ్ రిజిస్ట్రార్ సంపత్‌కుమార్ తెలిపారు.

బీజేపీలో చేరికలు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 13: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన 20మంది మహిళలు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డిదశమంతరెడ్డి సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి శివరాజ్‌యాదవ్, సౌడ రమేష్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వేడుకగా వార కల్యాణం

చిలుపూర్, ఏప్రిల్ 13: చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి వార కల్యాణాన్ని శనివారం వేడుకగా నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి - పద్మావతి అమ్మవార్ల కల్యాణ తంతును వైభవంగా ముగించారు. అనంతరం భక్తులకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను అందజేశారు.

సోషల్ మీడియా కో కన్వీనర్‌గా

సాయిప్రసాద్


సాయి ప్రసాద్

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 13: బీజేపీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఐటీ, సోషల్ మీడియా నియోజకవర్గ కో-కన్వీనర్‌గా రాఘవపూర్ గ్రామానికి చెందిన గుర్రపు సాయిప్రసాద్ ఎంపికయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి శనివారం నియామక పత్రం అందించారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో


పోచన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కొమురయ్య

బచ్చన్నపేట, ఏప్రిల్ 13: మండలంలోని నాలుగు గ్రామాల్లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆర్డీవో కొమురయ్య పరిశీలించారు. ఐకేపీ ఆధ్వర్యంలోని బచ్చన్నపేట, పోచన్నపేట, కొడవటూరు, పీఏసీఎస్ ఆధ్వర్యంలోని కేశిరెడ్డిపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారా లేక ప్రైవేటు వ్యాపారులకు అమ్ముతున్నారా అని ఆరా తీశారు. రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడ్డట్టు తేలితే కఠిన చర్యలుంటాయని నిర్వాహకులను హెచ్చరించారు. తహసీల్దార్ విజయలక్ష్మీ, ఏపీఎం నాగేశ్వర్‌రావు పీఏసీఎస్ సీఈవో బాలస్వామి తదితరులున్నారు.

నర్మెట: ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఆర్డీవో కొమురయ్య అన్నారు. శనివారం వెల్దండ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఏపీఎం మాదారపు రవి, సెంటర్ ఇంచార్జి కుమారస్వామి, ఏఈవో కన్నయ్య, కార్యదర్శి వినయ్ పాల్గొన్నారు.

సందర్శించిన తహసీల్దార్లు..

రఘునాథపల్లి: మండలంలోని శ్రీమన్నారయణపురం, ఇబ్రహీంపూర్, లక్ష్మితండ, సోమయ్యకుంట తండ, మాదారం, వెల్ది గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ యుగేందర్ శనివారం సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్తాలో 41 కిలోల ధాన్యం మాత్రమే తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం సారయ్య, సీసీలు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: మండలంలోని ఓబులాపూర్, తమ్మడపల్లి(జి), సూరారం, తీగారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ అంబటి ఆంజనేయులు శనివారం సందర్శించారు. ధాన్యం నిల్వలతో పాటు రిజిస్టర్లను తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాల్లోకి వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి, సంబంధిత మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమాల్లో ఐకేపీ సీసీ మామిడాల సహదేవ్, సిబ్బంది, నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

మాదిగల ద్రోహి కడియం శ్రీహరి

ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్ మాదిగ


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మెస్పీ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 13: మాదిగల ద్రోహి కడియం శ్రీహరి అని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్ మాదిగ అన్నారు. రాజకీయంగా మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మాదిగ, అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేబట్టారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి రవీందర్ మాట్లాడారు. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీలోకి మారి అధికారం కోసం అధికార పార్టీ వద్ద భజన చేసే కడియంకు మంద కృష్ణమాదిగను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. అధికార దాహం కోసం మాదిగలను రాజకీయంగా ఎదగకుండా వంచిస్తున్న కడియంకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించాడు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కడియం కావ్యకు ఓటుతో తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా నాయకుడు మంద శ్రీనివాస్, చాడ ఏలియా, గోవిందు ఇసాక్, మారపాక ప్రశాంత్, మచ్చ అబ్బయ్య, మేడ స్వామి, గాదెపాక మహేందర్, గుర్రం నవీన్, నల్ల ఉపేందర్, గాదె శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బడుగుల హక్కులకు రక్షణ


విలేకరులతో మాట్లాడుతున్న సీనియర్ నాయకుడు సీహెచ్.రాజమౌళి

జనగామ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే దేశంలోని బడుగు, బలహీన వర్గాలకు రక్షణ ఉంటుందని ప్రముఖ వైద్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత సీహెచ్.రాజమౌళి అన్నారు. జనగామలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సభలో భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో ఆయన బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేఖరులతో మాట్లాడుతూ 30 ఏళ్లుగా అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని అనుసరిస్తూ వైద్యసేవలు అందిస్తున్నానన్నారు. దేశాన్ని మతతత్వ శక్తుల నుంచి కాపాడి ఆర్థిక ప్రగతి తీసుకురావడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. భువనగిరి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం తథ్యమన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజమౌళికి కాంగ్రెస్ నాయకులు వంగపల్లి అంజనారెడ్డి, తూడి ప్రభాకర్, మొర్త్రాల ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు.

ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠాపన పనులు ప్రారంభం


శివాలయంలో పనులను పరిశీలిస్తున్న కమిటీ ప్రతినిధులు

జఫర్‌గడ్, ఏప్రిల్ 13: మండల కేంద్రంలోని శ్రీఉమా నీలకంఠ పరమేశ్వరస్వామి దేవాలయం (శివాలయం)లో శనివారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన పనులు ప్రారంభమయ్యాయి. ఆలయ ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరడంతో గ్రామ ప్రజల సహకారంతో పురోహితులు యెల్లంబట్ల శశిధర్ శర్మ, వేద పండితుల ఆధ్వర్యంలో నూతన ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించేందుకు నిర్ణయించారు. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు పెద్ద ఎత్తున ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం నుంచి ఆలయంలో ఉత్సవ పనులు చేపట్టారు. గ్రామ ఆలయాల అభివృద్ధి కమిటి ప్రతినిధులు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షుడు అన్నెబోయిన భిక్షపతి, ప్రతినిధులు మొగిలిపాక నర్సింగం, తాటికాయల యాకయ్య, కన్న సోమశేఖర్, పట్టపురి కృష్ణ, కుల్ల రాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మంత్రులకు సంఘం నాయకుల వినతి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఏప్రిల్ 13: వెనకబడి ఉన్న నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘ నాయకులు కోరారు. శనివారం ఈ మేరకు కాంగ్రెస్ అనుబంధ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సమైక్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకన్న, కె.సతీష్ మాట్లాడారు. పలు కార్పొరేషన్ల చైర్మన్, డైరెక్టర్ పదవుల్లో, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశాలు కల్పించాలన్నారు. ఆధునిక సెలూన్ల ఏర్పాటుకు యువతకు రూ.10 లక్షలు రుణం, 55 ఏళ్లు నిండిన వారికి పింఛన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, శ్రీనివాసరావు, శ్రీహరి, వేణుగోపాల్, విజేందర్, శ్యామ్, కిరణ్, మల్లికార్జున్, రాఘవ, దాసు పాల్గొన్నారు.

దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు..

జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్


చీటూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏవో వినోద్‌కుమార్

లింగాలఘణపురం, ఏప్రిల్13: రైతులు తొందరపడి దళారుల చేతిలో మోసపోవద్దని జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం లింగాలఘణపురం మండలం చీటూరు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను పాటించి ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2203, కామన్ గ్రేడ్ ధాన్యానికి రూ. 2183 ధరను పొందాలని సూచించారు. దళారుల మాటలు నమ్మొద్దని తెలిపారు. డీసీఎస్‌వో రోజారాణి మాట్లాడుతూ 17 తేమశాతం లోపు ఉండేవిధంగా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని మద్దతు ధరను పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఏఈవో అపూర్వ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

జనగామ కల్చరల్, ఏప్రిల్ 13: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్ది వెంకటనారాయణ గౌడ్, గంగిశెట్టి మనోజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా అండర్-14, 16, 18, 20 విభాగాలలో క్రీడాకారులు మెన్, వుమెన్ 100, 400, 800, 1500, 2000, 5000 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నారు. ఈ పోటీలలో జిల్లా నుంచి 25 మంది బాలబాలికలు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 28న సూర్యాపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్‌కుమార్, రంజిత్,కిరణ్, సుధారాణి, గజ్జల్లి రాజు, రాజు, సురేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు